క్లుప్తంగా

చింతంపల్లిలో ఎన్నికల ప్రచారం



మేము సిద్ధం - మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

చింతలపూడి: మండలంలోని చింతంపల్లి పంచాయతీ పరిధిలోని బూత్ నెంబర్–1 లో శుక్రవారం మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, మండల బూత్ కన్వీనర్ శింగిరెడ్డి భరత్‌రెడ్డి, తాండ్ర రవికుమార్, చంటిబాబు, సాంబ, తిరుపతిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాయిబాబా చిత్రపటం ఊరేగింపు



సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

టి.నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



విరాళం బాండ్ పత్రం అందిస్తున్న రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కైకలూరు మండలం భుజబలపట్నంకు చెందిన హేమాద్రి రాపిడ్ అండ్ నిడ్స్ బ్రాంచి వారు శుక్రవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.


ముగిసిన ఇంటర్ పరీక్షలు



కొయ్యలగూడెం పరీక్షా కేంద్రం నుంచి ఉత్సాహంగా బయటకొచ్చిన విద్యార్థులు

కొయ్యలగూడెం: ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 1 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా, కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో సుమారుగా 650 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు, మరో 600 మంది సెకండ్ ఇయర్ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో ఆయా సెంటర్ల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా బయటకొచ్చారు.

ఆలయ ప్రారంభోత్సవం



దాస ఆంజనేయ స్వామి ఆలయం

కొయ్యలగూడెం: దాసాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మంచిలి రామలింగేశ్వర ఆచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి వాటర్ ట్యాంక్ ఎదుట పునర్నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించారు. 15, 16, 17 తేదీల్లో నిర్వహిస్తామని, 17వ తేదీ ఉదయం 7.15 గంటలకు దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామని ఆలయ కమిటీ పేర్కొంది.

బియ్యం విక్రేతలపై కేసు

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బొర్రంపాలెంకు చెందిన జూలూరి కరుణకుమార్, కామన శ్రీనివాసరావు ప్రజల వద్ద నుంచి 39 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని, డిప్యూటీ తహసీల్దార్ గుగులోతు ఉదయ భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

జగన్ హయాంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కొయ్యలగూడెం : నరసన్నపాలెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలరాజు



బుట్టాయగూడెం : కన్నారప్పాడు సమీపంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం నరసన్నపాలెం గ్రామంలో సర్పంచ్ కర్రెద్దు ప్రభావతి ఆధ్వర్యంలో జెడ్పీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.3.15 కోట్లతో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నరసన్నపాలెం నుంచి ధర్మారావుపేట వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించనున్నట్టు పీఆర్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకుంటోందని సర్పంచులు తెలిపారు. గంగవరం గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మితో కలిసి బాలరాజు ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, ఎంపీటీసీ మిరియాల విజయ, మద్యాహ్నపు ఏసు, బాలం వెంకటరామయ్య పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం: గిరిజనుల అభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పులిరామన్నగూడెం నుంచి చింతపల్లి వరకు రోడ్డు నిర్మాణం పనులకు శుక్రవారం కన్నారప్పాడు సమీపంలో ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకు కొండల మధ్య నుంచి రోడ్డు పనులు చేశారని గుర్తుచేశారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు టీడీపీ ప్రభుత్వం కనీస మరమ్మతులు కూడా చేయించలేదని ఆరోపించారు. నేడు వైఎస్ తనయుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.4.20 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. దీంతో కన్నారప్పాడు, ముంజులూరు, చింతకొండ, తదితర గ్రామాల గిరిజనులకు రోడ్డు కష్టాలు తీరనున్నాయని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా కొండ గ్రామాల్లో కూడా పథకాల లబ్ధి నేరుగా ఇంటికీ చేరుతోందని వివరించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు కెచ్చెల ముక్కారెడ్డి, సర్పంచ్ మడి శ్రీరాములు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, నాయకులు ఆరేటి సత్యనారాయణ, షేక్ ముత్తా సాహెబ్, యోహాన్ నాయక్, ములగాల నాగేశ్వరరావు, దోరేపల్లి త్రిమూర్తులు, పైదా కృష్ణ, కొవ్వాసి వెంకటేష్, సోదెం బొజ్జియ్య, కుర్సం రమణ, కంగాల లక్ష్మణరావు, డ్వాక్రా సంఘాల నాయకురాలు దుర్గ, కార్యదర్శి నాగరాజు, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

కామవరపుకోట: ఎంపీ నిధులు రూ.10 లక్షలతో కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ శంకుస్థాపన చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రెండో సారి అధికారంలోకి తీసుకొస్తాయని రమేష్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్, ముళ్లపూడి నాగరాజు, మెరుగు నాగరాజు, కల్లూరి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరంలో రూ.3.50 లక్షలతో చేపట్టే సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు నిమ్మ గురునాధరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొల్లి జోగిరాజు, పార్టీ నాయకులు చిల్ల దుర్గారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి జగదాంబ తల్లి ఉత్సవాలు



జగదాంబ అమ్మవారు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా వరాలిచ్చే అమ్మగా జీలుగుమిల్లిలో కొలువై ఉన్న జగదాంబ అమ్మవారి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 8.58 నిమిషాలకు కలశస్థాపనతో అమ్మవారి 67వ జాతర మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ కక్కిరాల రామారావు తెలిపారు. ఐదు రోజుల పాటు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో జరిగే ఈ ఉత్సవాల్లో ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఏటా పాల్గుణమాస శుద్ధసప్తమి రోహిణీ నక్షత్రయుక్త మేషలగ్నంలో ఈ మహోత్సవాలు ప్రారంభమవుతుంటాయి. జాతర సందర్భంగా అమ్మవారి గుడితో పాటు ఉత్సవాలు జరిగే ప్రదేశం, గుడి సమీపంలో ఉన్న అశ్వారావుపేట – జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా చేసిన విద్యుత్ అలంకరణలు తిరునాళ్లకు వచ్చే భక్తులు కనువిందు చేస్తాయి. ఉత్సవాల నేపథ్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సహరించాలని ఆయన కోరారు.

‘అభివృద్ధి కోరేవారిని ఆదరిస్తాం’



కొయ్యలగూడెం : రాజవరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజ్యలక్ష్మి



స్థల దాతలను సన్మానిస్తున్న రాజ్యలక్ష్మి

కొయ్యలగూడెం: రాష్ట్ర అభివృద్ధిని కోరుతూ ఆత్మాభిమానం గల ఇతర పార్టీ శ్రేణులు వైఎస్సార్ సీపీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం రాజవరం, యర్రంపేట పంచాయతీల పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆంధ్రుల ఆత్మాభిమానాలను తాకట్టుపెట్టి బీజేపీ పెద్దలతో అంటకాగుతోన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల తీరుతో ఆ పార్టీల శ్రేణులు మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. జననేత జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు పొందామని స్వయంగా ఆయా పార్టీల శ్రేణులు పేర్కొంటున్నాయని వివరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఎదుర్కోలేక తమ అభ్యర్థుల ఎంపికకు అడ్డదారులు తొక్కుతూ టీడీపీ, జనసేనలు పార్టీ కండువాలను మార్చి టికెట్లను కేటాయిస్తుండడం సిగ్గుమాలిన విషయంగా పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకోవాలని ప్రజలను రాజ్యలక్ష్మి కోరారు. పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సమన్వయ కమిటీ సభ్యుడు మంతెన సోమరాజు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, పీఏసీఎస్ అధ్యక్షురాలు విగ్గిన వెంకటలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చిడిపి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూలపల్లి కాంతారావు, ఎంపీటీసీ నారా అన్నపూర్ణ, కంతమణి సుబ్బారాయుడు, ఉస్సే బాబురావు, చింతలపూడి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

భూ దాతలకు సత్కారం

కొయ్యలగూడెం మండలం గంగవరం గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం కార్యాలయాలకు స్థలాలు ఇచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రు నాగబాబు, ఝాన్సీరాణి దంపతులను వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి సన్మానించారు. పార్టీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించారు. అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, కొండేపాటి చింతయ్య, మద్దిపాటి సోమేశ్వరరావు, శ్రీరంగ నిలయం కాశీ విశ్వనాథం, వుసా దామోదరం, మెండా నాగరాజు, మద్దిపాటి నారాయణరావు, కోన గంగరాజు, వామిసెట్టి శివాజీ, గంటా సత్యనారాయణ, విహగ్రహాల గంగాధరం, బల్లే నరసింహారావు, ఈడుపు గండి తాతారావు, పంతెన మురళీకృష్ణ, ఎస్కే మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



సర్వైలెన్స్ బృందాలతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్వో అద్దయ్య

జంగారెడ్డిగూడెం: రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె.అద్దయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో రికార్డింగ్ బృందాలతో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు ఏమైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. వాహనాల తనిఖీల సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సర్వైలెన్స్ బృందాలకు సూచించారు. చెక్ పోస్టుల వద్ద, వాహనాల తనిఖీ, సభలు, సమావేశాలు, ర్యాలీలు సమగ్రంగా వీడియో షూటింగ్ చేయించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ ఎన్నికల బృందాలు పాల్గొన్నాయి.

నూకాలమ్మ జాతర మహోత్సవాలకు శ్రీకారం



నూకాలమ్మ ఆలయంలో ఉత్సవాల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు ఏప్రిల్ 5 నుంచి 13వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆలయంలో ఆహ్వాన పత్రాన్ని ఆలయ కమిటీ విడుదల చేసింది. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ తమ పూర్వీకులు తీసుకున్న నిర్ణయాన్ని కొనసాగిస్తూ 60 ఏళ్లుగా భక్తుల సహకారంతో వార్షిక జాతర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఆలయాన్ని 2019లో పునర్నిర్మించామని చెప్పారు. మహోత్సవాలు 5న ఉదయం కలశస్థాపనతో ప్రారంభమై 13వ తేదీ మహా పూర్ణాహుతితో సంపూర్ణమవుతాయని తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు యర్రమిల్లి మనోజ్ శర్మ మాట్లాడుతూ గురువారం ఉదయం 9:02 నిముషాలకు రాటపాతి ఉత్సవాలకు ఆలయ కమిటీ శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో వీరంపాలెం ఆధ్యాత్మిక ప్రతినిధి బ్రహ్మశ్రీ ఈమని శశి కుమార్ శాస్త్రి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్, రామకృష్ణ మాస్టారు, కారింగుల రామకృష్ణ కుటుంబ సభ్యులు, మేడవరపు విద్యాసాగర్, పెనుమర్తి రామ్ కుమార్, అల్లూరి రామకృష్ణ, పి.వాసు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ



డాక్టర్ పాల్‌సతీష్

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ ఆసుపత్రిని ఏలూరు జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాలతో ఇటీవల ఇక్కడ ప్రసూతి వైద్య నిపుణులను నియమించామని, మరో జూనియర్ ప్రసూతి వైద్యులు త్వరలోనే అందుబాటులోకి వస్తారని తెలిపారు. ఒక జనరల్ మెడికల్ స్పెషలిస్ట్ వైద్యులు, పిల్లల వైద్య నిపుణులు కూడా అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు తుదిదశకు వచ్చాయన్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



బూత్ కన్వీనర్లకు సిద్ధం కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: ప్రతి కార్యకర్తా వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శుక్రవారం తడికలపూడి గ్రామంలో పార్టీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. వారికి సిద్ధం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జేపీసీఎస్ కన్వీనర్ వేముల సాయి, తడికలపూడి సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్, మండల బూత్ కన్వీనర్ బొట్ల లక్ష్మణ్, కొండపల్లి ధర్మరాజు, నిట్ట తాటేష్, మద్దుల ఆశీర్వాదం, బొట్ల రఘు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి

కామవరపుకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పౌష్టికాహారన్ని క్రమం తప్పకుండా అందించాలని జిల్లా ప్రాజెక్ట్ అధికారి పద్మావతి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవల్లో భాగంగా తడికలపూడి–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల కొలతలు తీసుకున్నారు. పిల్లల తల్లిదండ్రుల గృహాలను సందర్శించి పరిశీలించారు. గర్భిణులకు రక్తహీనత తగ్గేందుకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ బ్యూలా, ఏఓ మల్లిక, సీడీపీఓ పాల్ రాజశేఖర్, ఏరియా సూపర్‌వైజర్లు మంగాదేవి, వీర కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాన్షీరామ్ జయంతి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమాఖ్య ఆధ్వర్యంలో (అంబేడ్కర్ సర్కిల్ వద్ద) మాన్యశ్రీ కాన్షీరామ్ 90 జయంతి కార్యక్రమం నిర్వహించారు. కాన్షీరామ్ చిత్ర పటానికి డాక్టర్ కోట సుబ్బారావు, లాయి శ్రీనివాసు, జోగి రవి, గుత్తి రామకృష్ణ, అనువులంక శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబాసాహెబ్ చెప్పింది ఆచరణలో చూపించి ఉత్తరప్రదేశ్‌లో రాజ్యాధికారం నాలుగు సార్లు చేపట్టి చూపించిన మహామేధావి కాన్షీరామ్ అని కొనియాడారు. ఇన్వర్టర్ నాగు, బీఎస్పీ నాయకులు కలపాల రాజకుమార్‌లు మాట్లాడారు.

రేపు గడ్డపల్లిలో ఉచిత వైద్య శిబిరం

కొయ్యలగూడెం: పోలవరం మండలం గడ్డపల్లి గ్రామంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్నాపురం గ్రామానికి చెందిన ఊమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కన్వీనర్ కట్టా లక్ష్మి పేర్కొన్నారు. రాజమండ్రి ప్రముఖ వైద్య నిపుణులు గోలి రామారావు నేతృత్వంలో గడ్డపల్లి పంచాయతీ సహా ఎనిమిది గ్రామాల ప్రజలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు



కమిషనర్ నరేంద్రకుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చిన అంజి తదితరులు

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేంద్రకుమార్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు సంకు సురేష్, నేట్రు గణేష్, చిప్పాడ వెంకన్న తదితరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.


ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

చింతలపూడి : చింతలపూడిలో ప్రసిద్ధి చెందిన విశ్వనాధమఠం ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేసినట్టు ఆలయ ఈఓ కె.సాంబశివరావు తెలిపారు. కామన్‌గుడ్ ఫండ్ దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు చెప్పారు. సీజీఎఫ్ నిధులు శ్రీ రాజరాజేశ్వరి సత్సంగ్ అండ్ సేవక్ సంస్థ, దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.25 కోట్లు వెచ్చిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు కోట శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి హెచ్చరించారు. ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కు వచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన బాలిక ఇంటికెళ్లి వివాహాన్ని నిలుపుదల చేశారు. బాలికకు, వరుడుకి, వారి తల్లిదండ్రులకు ఏలూరు డీసీపీఓ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచక్రవేణి మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం –2006 ప్రకారం తీసుకునే చట్టపరమైన చర్యలను వివరించారు. బాలికను విద్య, వసతి నిమిత్తం బాలకల వసతి గృహానికి తరలించినట్టు చైల్డ్ లైన్–1098 కోఆర్డినేటర్ వైవీ రాజు తెలిపారు. వధువు, వరుడు తల్లిదండ్రుల నుంచి అఫిడవిట్‌ను పెదవేగి తహసీల్దార్ సూర్యప్రభ, ఐసీడీఎస్ పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బైండోవర్ తీసుకున్నారు. కార్యక్రమంలో పెదవేగి సూపర్‌వైజర్ శాంత, కొప్పాక సచివాలయం మహిళాకార్యదర్శి కుసుమ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు జిల్లా పదవులు



రాపోలు భావన రుషి



చనమాల రాజేష్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన నాయకులకు వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి పదవులు వరించాయి. పట్టణానికి చెందిన రాపోలు భావన రుషిని జిల్లా వీవర్స్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా, చనమాల రాజేష్‌కు ఏలూరు జిల్లా బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా వారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు నిర్దేశించిన విధుల్లో సమర్థవంతంగా పనిచేసి ఆయా కమిటీలు, పార్టీ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా భావన రుషికి, చనమాల రాజేష్‌కు పలువురు పట్టణ ప్రముఖులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.